1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

యోగాలో గోల్డ్ మెడల్ సాధించిన మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-జైనథ్

కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర 3వ పోలీస్ క్రీడల్లో మండల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఆర్.రూప యోగాలో గోల్డ్ మెడల్ సాధించింది. సోమవారం ఆమెను మండల యువకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవోల్ల సంజీవ్ మాట్లాడుతూ మండల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఇలాంటి విజయాలు మీరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వంగ పురుషోత్తం, మండల యువకులు పాల్గొన్నారు.



దుబ్బగూడెంలో ఎమ్మెల్సీ కోదండరాం పర్యటన

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం గ్రామంలో సోమవారం తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పర్యటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తాననన్న గుర్తింపు, ఇంటి స్థలాలు ఇవ్వాలని, పెన్షన్ ఇచ్చి గౌరవించాలని కోరారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోనెల శ్రీనివాస్, శ్రీలత, కొమ్ముల బాపు, సిలోజు మురళి, సపాట్ శంకర్, కొయ్యాడ శ్రీనివాస్, సంద్ర భూమయ్య అచ్చె భాగ్యలక్ష్మీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

- జిల్లాకు బీజేపీ ఇచ్చిన హామీల అమలు చేయాలి
- జిల్లాకు అన్యాయంపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రానికి ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలను ఇచ్చిన ఆదిలాబాద్ జిల్లాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి బీజేపీ ప్రజలను మోసగించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్ అన్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ఒక్క రూపాయి తీసుకురాని బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి, బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీసీఐ, ఆదిలాబాద్ రైల్వే లైన్, విమానాశ్రయం తెరిపిస్తామని హామీలిచ్చి బడ్జెట్‌లో నిధులు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని, దేశ అభివృద్ధికి శాపంగా ఉండనుందని పేర్కొన్నారు. ప్రజల జీవితాలకు, శ్రామికుల బతుకుదెరువుకు శాపంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు బడాబాబుల బొజ్జలను మరింతగా నింపేలా, మధ్యతరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. ప్రమాదకరమైన విధానాలు అమలు జరిపేందుకు మరింత ప్రోత్సాహంగా ఉన్న ఈ బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇంత మొండిగా బరితెగించి ప్రజావ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో శ్రామికులు, ఇతర ప్రజానీకం ఐక్యంగా పోరాటాలు నిర్వహించటం తప్ప మరో మార్గం లేదన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధానాల ఫలితంగానే దేశం తిరోగమిస్తున్నదని బడ్జెట్ కంటే ముందు రోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేలో చాలా స్పష్టంగా బట్టబయలైందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానికి ఎకనామిక్ అడ్వైజర్‌గా ఉండే వ్యక్తి పర్యవేక్షణలో రూపొందిన రిపోర్టును సైతం పరిగణనలోకి తీసుకోకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ఈకాలంలో నిత్యావసరాల సరుకులను సాధారణ ప్రజలు పెద్దగా కొనుగోలు చేయలేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల వేతనాలు పెరగకపోవటమే ఇందుకు కారణమని తెలిపారు. ఇది కష్టజీవుల జీవితాలను అతలాకుతలం చేసిన చర్య తప్ప మరేమిటని ప్రశ్నించారు. ఉపాధి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసగించిందని విమర్శించారు. బీమా రంగంలో ఎఫ్‌ఐలను 74 శాతం నుంచి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమేనని చెప్పారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు లంక రాఘవులు, బండి దత్తాత్రి, జిల్లా, కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, కిష్టన్న ఆర్.మంజుల, ఆర్.సురేందర్, నెల్ల స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, దేవతల స్వామి, గంగారాం, మహాదవ్, ఆరిఫా, అనసూయ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఆధ్వర్యంలో..

కేంద్రం బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కు గుండు సున్నా ఇచ్చిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్ ఎదుట బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంతో పాటు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. నలుగురు ఎమ్మెల్యేలను ఒక ఎంపీని ఓట్లేసి గెలిపిస్తే ఏం చేశారని మండిపడ్డారు. జీఎస్టీ రూపంలో ప్రజలను పీల్చి పిప్పిచేసి వసూలు చేసిన కోట్లాది రూపాయలకు బదులుగా బడ్జెట్లో గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. జిల్లా నుండి కేంద్రానికి ఎంత బడ్జెట్ వెళ్లింది, కేంద్రం జిల్లాకు ఏమిచ్చిందో చెప్పాలని ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. బహిరంగా చర్చకు సిద్ధంగా ఉన్నట్లు సవాల్ విసిరారు. జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, సీసీఐ పునరుద్ధరణ, విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్క్ లాంటి అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో మార్పులు చేర్పులు చేసి జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్‌రావు పటేల్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, బేల మండల పార్టీ అధ్యక్షులు ఫైజల్లాఖాన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, మాజీ కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, రాంకుమార్, భూమన్న, జాఫర్ అహ్మద్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశానుసారం సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు ఉన్నా కేంద్రం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో సుమారు రూ.లక్ష వేల కోట్ల వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీసం రూ.40 వేల కోట్లు తిరిగి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల రాష్ట్రాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఉట్నూర్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయింపులో గాడిద గుడ్డు ఇచ్చిందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ చీఫ్ పిలుపు మేరకు నిరసన చేపట్టి, ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు, ఆదిలాబాద్ ఎంపీ బడ్జెట్ నిధుల కేటాయింపులో నోరు మెదపకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో దగాకు గురైన తెలంగాణను పున:నిర్మించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఈ తరుణంలో కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, బ్లాక్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



నిర్మల్‌లో..



ఉట్నూర్‌లో ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం

కేంద్ర బడ్జెట్‌లో ఆదిలాబాద్ అన్యాయం



నవతెలంగాణ-తలమడుగు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణతో పాటు ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం సుంకిడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి 8 ఎంపీ స్థానాలున్నా రాష్ట్రానికి, జిల్లాలకు బడ్జెట్‌లో కేటాయింపు చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. గతంలో ప్రధాన మంత్రి స్వయంగా జిల్లాకు వచ్చి మాటిచ్చినా ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఒకటి కూడా మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాబన్న, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, నాయకులు సల్ల దేవన్న, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, రాంచందర్, రఫిక్, విలాస్ యాదవ్, రావుల నారాయణ, నడిపెన్న, బాబు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసులకు తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బానావత్ గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసులకు ఎలాంటి కేటాయింపులు పెంచకుండా గతంలో ఇచ్చిన దానికంటే మరింత తక్కువగా ఇవ్వడం సరికాదన్నారు. కేంద్రం ఆదివాసుల అభివృద్ధిని మరిచిందని అర్థంపర్థం లేని పథకాల పేర్లు పెట్టి గిరిజనులను మాయ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి సంఘం నాయకులు ఆత్రం రాజేశ్వర్, ఊర్వత ఆనంద్ రావు, ఆత్రం వసంత్ రావు, వెడ్మ శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్ పోటీల్లో మోడల్ విద్యార్థిని సత్తా

నవతెలంగాణ - కాసిపేట



మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని అభివర్ధిని రాష్ట్ర స్థాయి ఆంగ్ల ఒలింపియాడ్ ఉపన్యాస పోటీల్లో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో అభివర్ధిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి యాదయ్య విద్యార్థిని సత్కరించి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని సన్మానించారు. విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ సత్యనారాయణను జిల్లా విద్యాధికారి, సెక్టోరల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, చౌదరి, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల



ఎటువంటి అనుమతులు లేకున్న జిల్లాలో ప్రచారం చేస్తున్న ప్రయివేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో కిడ్స్ ఎలిమెంటరీ స్కూల్ పేరుతో పాఠశాల ఏర్పాటు చేసి రాబోయే విద్య సంవత్సరానికి అడ్మిషన్స్ చేస్తున్నారన్నారు. పాఠశాల పేరుతో బహిరంగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తల్లి దండ్రులను మోసం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతులు లేని ఇటువంటి పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు, యుఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌బి విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, మిట్టపల్లి తిరుపతి పాల్గొన్నారు.

సిమెంట్ బెంచ్‌కు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు హెచ్‌పి పెట్రోల్ పంపు ముందున్న సిమెంట్ బెంచ్‌ను బైక్‌తో ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడని ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. మోదెల గ్రామానికి చెందిన రవికుమార్, రాయవేని రాజశేఖర్‌తో కలిసి ఆదివారం రాత్రి అటుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ పంప్ ముందున్న బెంచ్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురి ఆస్పత్రిలో రాజశేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవికుమార్ జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని భార్య భాషవేని అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

సమిష్టి నిర్ణయంతోనే జాతర బహిరంగ వేలం పాటలు

నవతెలంగాణ-జైపూర్



వేలాల మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్న బహిరంగ వేలం పాటలు గ్రామస్తుల సమిష్టి నిర్ణయంతో చేపట్టాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు అన్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్‌తో కలిసి సోమవారం వేలాల గ్రామాన్ని సందర్శించి బహిరంగ వేలం పాటలు నిర్వహించేందకు గ్రామస్తులతో చర్చించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో పర్యటించిన ఆయన నిరంతరంగా పారిశుధ్య పనులు కొనసాగాలని సూచించారు. తడిపొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, ఇంటి పన్ను వసూళ్ల వంద శాతం పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు.

లక్ష డప్పులు-వేల గొంతులు వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుల ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో ఎస్సీ వర్గీకరణ కల సాకారం కానుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు గోగర్ల రాజయ్య, రాంచందర్, మండల అధ్యక్షులు అశోక్, నాయకులు, వినేష్, సాయి, మహేష్, కూటికల పరదేశి, కృష్ణ, పోర్ల స్వామి, నగేష్, వెంకటి పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమ వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గజ్జల అశోక్ మాట్లాడుతూ లక్ష డప్పులు, వేల గొంతులు అనే నినాదంతో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో మండలం మాదిగలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేఆయలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోనె అడెల్లు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రాజేశ్వర్, నాయకులు బట్టు అంకుష్, గుడిసె గంగన్న, సురేష్ పాల్గొన్నారు.



ఎస్ఆర్పీ ఓసీలో కేబుల్ చోరీకి విఫలయత్నం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి ఓసిపిలో ఆదివారం ఐదుగురు దొంగలు కేబుల్ చోరీకి విఫలయత్నం చేశారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఆదివారం రెండవ షిఫ్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులకు 10గంటల సమయంలో కరెంట్ సేవలు నిలిచిపోవడంతో ఎంటిఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎంటిఎఫ్ సిబ్బంది క్వారీ లోపల గాలింపు చర్యలు చేపట్టగా పంపులకు వచ్చే కేబుల్ చోరీకి గురైందని గమనించారు. వెంటనే ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డికి విషయం తెలిపగా జూనియర్ ఇన్‌స్పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదార్లతో కలిసి ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బందిని గమనించిన దొంగలు ఏడు చుట్టల రాగి కేబుల్, గొడ్డలి, వాటర్ బాటిల్ క్వారీలోనే వదిలేసి పారిపోయారు. క్వారీ పరిసర ప్రాంతాలను పరిశీలించగా భూమిలో పాతిపెట్టిన రెండు కేబుల్ చుట్టలు దొరికాయని, వీటన్నింటిని ఎస్అండ్‌పిసి కార్యాలయంలో భద్రపరిచినట్లు సమాచారం.



విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన సోన్ మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై గోపి వివరాల ప్రకారం..పాక్‌పట్ల గ్రామానికి చెందిన నర్సయ్య(48) తన పంట చేనుకు నీరు పెట్టడానికి సోమవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేసేంత వరకూ ప్రశ్నిస్తాం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చేంత వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేసిన అభివృద్ధి పనులతో పాటు తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని గుర్తుచేస్తూ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. ప్రజా గొంతుకగా నిలబడి పోరాడాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, సాజిదొద్దీన్, బుట్టి శివ, ధమ్మపాల్, కొండా గణేష్, లక్ష్మణ్, అడప తిరుపతి, శ్రీనివాస్, అత్తఉల్లా, అయ్యుబ్, సురేందర్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్



గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ గిరిజనులు తమ గోడును వినిపించారు. సిర్పూర్ మండలం కొమ్ముగూడెం చెందిన మారు తనకు ఏదైనా లోన్ ఇప్పించాలని, బోథ్ మండలం కోటపల్లి గ్రామానికి చెందిన సోమన్న తనకు బోరు బావి మంజూరు చేయాలని, సిర్పూర్(యు) మండలం రాగాపూర్ గ్రామానికి చెందిన కోవశంబు కిరాణా షాప్‌కు రుణం అందించాలని పీఓను కోరారు. వీరితో పాటు పలు గ్రామాల ప్రజలు రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలు మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు. ఐటీడీఏ ఏపీవో వసంతరావు, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సోమవారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాదిగ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాల వివరాలను నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము బాపురావు, అనంత్‌రావు, రాజన్న, లాజర్, కాంతారావు, రాజు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

తమతో పాటు కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో మరణించగా అతని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన ముష్కే రాజేశ్(37) ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతని కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. అతనికి భార్య బాగ్య, కుమారుడు శివకుమార్, కుమార్తె శివాని ఉన్నారు. ఈ నేపథ్యంలో మృతుడు ముష్కే రాజేశ్‌తో కలిసి బీర్నంది పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి స్నేహితులు మరణించిన స్నేహితుడి కుటుంబానికి తమవంతుగా ఆర్థికంగా చేయూతనందించారు. సోమవారం స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి, నగదును భార్య, కుమారుడు, కుమార్తెలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, ప్రసాద్, మల్లేష్, రాకేష్, చంద్రమౌళి, చంద్రశేఖర్, మహేందర్, నర్సయ్య, రమేష్, కళ, ఎలియాస్, రమేష్ పాల్గొన్నారు.



బడ్జెట్ కార్పొరేట్ లాభాలకు, ప్రజా సంక్షేమానికి కాదు : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ సమాజంలోని అగ్రశ్రేణి కార్పొరేట్‌లకు మేలు చేసే విధంగా, సామాన్య ప్రజల అవసరాలను పూర్తిగా విస్మరించిందని సీపీఐ(ఎం) పట్టణ కమిటీ విమర్శించింది. సోమవారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఫసిఉద్దీన్, తొడసం శంబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కొద్దిమంది కార్పొరేట్ వర్గాలకు మరింత లాభదాయకంగా మారిన విధంగా ఈ బడ్జెట్ రూపుదిద్దుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, కార్మికులు, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాల కోసం ప్రకటించాల్సిన బడ్జెట్ నిధులను కుదించి, కార్పొరేట్ కంపెనీలకు భారీగా పన్ను మినహాయింపులు ఇవ్వడం ప్రజా వ్యతిరేక చర్య అని మండిపడ్డారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేయకుండా పీఎం కిసాన్ నిధుల కేటాయింపులను తగ్గించడం, రైతులకు మద్దతు ధర హామీ ఇవ్వకపోవడం అలాగే విద్య, ఆరోగ్య, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి తగిన నిధుల కేటాయించకపోవడం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ కార్పొరేట్‌లకు, విద్యుత్, బీమారంగాల్లో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం తెలంగాణకు రావాల్సిన న్యాయమైన నిధులను గణనీయంగా తగ్గించడం, జరిగిందని వారు విమర్శించారు అంతేకాకుండా నిర్మల్ జిల్లాకు ఆర్మూర్-నిర్మల్ రైల్వేలైన్ కోసం నిధులు కేటాయించకపోవడం. గిరిజన యూనివర్సిటీ, రాంజి గోండ్ మ్యూజియం వంటి ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం లేకపోవడం జరిగిందని వారు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ నాయకులు పంద్రం ఆనంద్‌రావు, ఉయిక భీమ్‌రావు, బర్కుంట గంగారాం, నవీన్, బంటు పాల్గొన్నారు.

కడెం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు మల్లేష్ యాదవ్, సతీష్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న కేటాయించారని వారన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకు నిధులు కేటాయించి, తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం పట్ల తీవ్ర అన్యాయం చేశారని వారు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్రంలో ఓట్లు, సీట్లే ముఖ్యం కానీ తెలంగాణ ప్రజల అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వారు బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, మాజీ సర్పంచ్‌లు బొడ్డు గంగన్న, ఆకుల బాలవ్వ లచ్చన్న, జాడి రాజమణి, ఇందూర్ కాంగ్రెస్ మండల నాయకులు ధర్మయ్య, చిన్నయ్య బ్రహ్మచారి, బబ్లు, రహీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చోడ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు కేటాయించిన నిధులు గుండు సున్నా అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుమ్ర కోటేష్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్ళెం నారాయణరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ రాష్ట్రంపై బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్ష తీరును నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కుమ్ర కోటేష్ మాట్లాడుతూ ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ నిర్మాణం కోసం ఒక రూపాయి కూడా కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. జిల్లా కేంద్రంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణం విషయం ఊసే ఎత్తక పోవడం మరోసారి జిల్లా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిన దాని ప్రస్తావనే లేదన్నారు. రాష్టం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నపటికీ తెలంగాణా రాష్ట్రంపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జల్లై జాకు, ఆసీఫ్ ఖాన్, షాదుల్లా, బోథ్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, అజీమ్, ముస్తఫా పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఏరియా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి కార్మికులకు అట్టడుగు వర్గ దళిత జాతులకు విద్యార్థి లోకానికి తీరని నష్టం జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. దేశంలోని 67శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటే, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. కేవలం ఉన్నత వర్గాలకే ఈ బడ్జెట్ కేటాయించిందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర కార్మిక, రైతులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు సుంచుల నారాయణ, గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

బోథ్ : జిల్లాకు నిధులు రాబట్టడంలో జిల్లా బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని సోమవారం మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లోని అంతకంటే ఎక్కువ ఆదిలాబాద్ జిల్లా వివక్షకు గురైనట్టు అన్నారు. దాదాపు 45 రోజుల ముందు నుంచి బీజేపీ ఎంపీ ఎమ్మెల్యేలకు వివిధ రూపాల ద్వారా ప్రజలు తమ విజ్ఞప్తులు ఇచ్చిన వాటన్నింటినీ పెడచెవిన పెట్టి, కేవలం కాల కాలయాపన చేస్తున్నట్లు ఈ జిల్లా ప్రజలు భావిస్తున్నారని ఇప్పటికైనా జిల్లాకి న్యాయంగా రావాల్సిన సీసీఐ పునరుద్ధరణ, ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్టు, హైదరాబాద్ నాగపూర్ పారిశ్రామిక కారిడార్, అనుమతులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గోర్ల రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అరుణ్ రెడ్డి, నాయకులు చట్ల ఉమేష్, మెరుగు భోజన్న, రాజశేఖర్, గడ్డల నారాయణ, షేక్ ఆబుద్, షేక్ షాకీర్, ఉమేష్ జాదవ్, గూడూరు వంశీరెడ్డి పాల్గొన్నారు.



ఇచ్చోడ



బోథ్

ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నేరడిగొండ

ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, హెచ్ఈఓ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని వాంకిడి గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు టీబీ, క్షయ, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా వారం రోజుల కన్నా ఎక్కువ దగ్గు వచ్చినట్లయితే వెంటనే మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. అంతేకాకుండా టీబీ లక్షణాలను వివరించారు. ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా దగ్గు వచ్చినట్లయితే తగ్గుతో పాటు రాత్రి వేళలో చెమటలు రావడం సరిగా ఆకలి వేయకపోవడం వంటి లక్షణాలు ఏర్పడినట్లు అయితే అది తప్పని సరిగా టీబీ లక్షణాలుగా వివరించారు. అంతేకాకుండా 40 మందికి ఓపి పరీక్షలు చేయగా, 17 మందికి తెమడ పరీక్షలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.సంతోష్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్స్ శ్రీలత, గంగామణి, సమీకి బాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు-వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బేల

7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలాధ్యక్షులు కుశ్నపెల్లి అంకుష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగల బలప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండల, గ్రామాల నుంచి పెద్దఎత్తున మాదిగలు, ఉప కులాలు తరలిరావాలని కోరారు. రాష్ట్ర శాసనసభలో మాట్లాడి నేడు అమలు చేయడంతో జాప్యం చేస్తున్నారన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేసి 58 కులాలకు రావాల్సిన విద్యా, ఉద్యోగ, రాజకీయ సంక్షేమ రంగాలలో వెనుకబాటుకు గురైన మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని, వర్గీకరణను అమల్లోకి తీసుకువచ్చి, మాదిగల చిరకాల స్వప్నమైన వర్గీకరణకు ముగింపు పలకాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగకి పద్మశ్రీ రావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. లక్షడప్పులు వెయి గొంతుకల భారీ బహిరంగ సభను చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దెకి సునీల్, పసుల శ్రీనివాస్, బుడగ జంగం ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు గోధురి తిరుపతి, శ్రీకాంత్, ప్రశాంత్, అనిల్, అంకుష్, నామాల శంకర్, నరసింహులు, కళ్యాణ్, స్వామి, టేకుల నందు, హరికృష్ణ పాల్గొన్నారు.

సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో తొలిసారిగా భారత రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళకు అవకాశం కల్పించడంతో దేశ ప్రజలు హర్షిస్తుంటే, రాష్ట్రపతి ముర్ము ప్రసంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన సోనియా గాంధీని వెంటనే భారత రాష్ట్రపతికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగిస్తుండగా పూర్ లేడీ, పూర్ స్పీచ్, అంటూ సోనియా గాంధీ మాట్లాడటం విచారకరమన్నారు. భారతదేశ ప్రజలతో పాటు ప్రపంచంలోని ప్రజలు ముర్ము ప్రసంగాన్ని వింటుండగా సోనియాగాంధీ కించపరిచేలా మాట్లాడారన్నారు. ఇటలీకి చెందిన సోనియాగాంధీ కావాలని భారతదేశ ప్రథమ పౌరురాలను కించపరిచిందన్నారు. భారత రాష్ట్రపతికి సోనియాగాంధీ క్షమాపణలు చెప్పకపోతే తెలంగాణ కాంగ్రెస్ కార్యాలయాన్ని, జాతీయ కాంగ్రెస్ కార్యాలయాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయన వెంట బానోత్ జగన్, ఆడే ధన్‌లాల్, సాడిగే రాజేశ్వర్, సీపతి లింగాగౌడ్, కొండేరి రమేష్, బింగి వెంకటేష్, మరికంటి నారాయణ, తస్నీరు, బానోత్ ఉపేందర్ ఉన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సోమవారం వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ముఖ్యఅతిథిగా వేద పండితులు ధర్మరాజ్‌ని ఆహ్వానించారు. అనంతరం 27 మంది పిల్లలను అక్షరాభ్యాసం చేయించి, అనంతరం అడ్మిషన్లు తీసుకున్నామని ప్రధానోపాధ్యాయురాలు మీనా అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు పాల రాజేశ్వర్, కార్యదర్శి సోలంకి చందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాజనర్సయ్య, ఆచార్యులు సుమలత, అరుంధతి, పల్లవి, నందిని, తేజస్విని పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు



నవతెలంగాణ-సారంగాపూర్

బాలల హక్కులు పరిరక్షణ అందరి బాధ్యత అని బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాలల హక్కులు వాటి పరిరక్షణపై విద్యార్థులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలు చదువుల్లో ముందంజలో ఉండాలని హితవు పలికారు. విద్యార్థులకి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను కోల్పోయి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలకి పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత మహిళా, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ ఏ. మౌనిక, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు సంగీత రాణి, హెచ్‌డబ్ల్యూఓ రాథోడ్ మంగీలాల్, ఉపాధ్యాయులు శిరీష, ఆశన్న, అనిల్, ప్రభాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-ఇచ్చోడ

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సాయి హనుమాన్ ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సాయి హనుమాన్ ఆలయాన్ని సందర్శించి, వసంత పంచమి సందర్భంగా భక్తులతో కలిసి ప్రత్యేక పూజా నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు సాయి హనుమాన్ విగ్రహాల పల్లకిని ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులకు భోజనాలతో పాటుగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భీంరెడ్డి, సభ్యులు పరమేశ్వర్, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు ముండే పాండు రంగ్, గాడ్గే సుభాష్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులు సంఘాలు బలంగా మారాలి

- హైకోర్టు రిటైర్డ్ జడ్జీ జస్టిస్ చంద్రకుమార్



నవతెలంగాణ-బేల

పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో లాగా తెలంగాణలోనూ రైతులు సంఘాలుగా ఏర్పడి బలంగా మారాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శంషాబాద్ గ్రామంలో అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఖోడే గోవింద్ బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ ప్రకారం పంటకు క్వింటాలుకు గిట్టుబాటు మద్దతు ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి, శ్రమతో కలిపి మరో సగభాగంతో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులు సమస్యలతో కుంగిపోవద్దని, భయపడవద్దని తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వాలతో సమస్యల పరిష్కారం, చేయూత కోసం అడిగే వ్యవస్థ ఉండాలన్నారు. రైతులు ధైర్యంగా సమన్వయంతో సమస్యలను అధిగమించాలని పేర్కొన్నారు. ఒక రైతుకు మరో నలుగురు ఆసరాగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వాలు రైతులకు సొసైటీల ద్వారా విత్తనాలు అందజేసి అభ్యున్నతికి కృషి చేస్తూ, వ్యవసాయం చేయించాలన్నారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వాలే ప్రతినిత్యం ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రిటైర్డ్ హెచ్ఎం శశికాంత్, అధ్యాపకుడు నరసింహారావు, మాజీ సర్పంచులు ఓల్లప్‌వార్ దేవన్న, ఖోడె విపిన్, యూత్ సభ్యులు రవి, హరీశ్, విశాల్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఎప్పుడు..?

- వివిధ గోదాముల్లో భారీగా డంప్
- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులు ఆరుగాలం చెమటోడ్చి, కష్టించి, అప్పులు చేసి పండించిన కందుల పంట దళారుల పాలవుతోంది. ప్రభుత్వం రైతులు పండించిన కందులకు కనీస మద్దతు ధర రూ.7,550 ప్రకటించింది. అయితే మండలంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఇంకను కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయక పోవడంతో రైతన్న దళారుల చేతిలో ఆర్థికంగా నష్టపోతున్నారని పలువురు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన మార్క్‌ఫెడ్ అధికారులు అలసత్వం వహించడమే దీనికి ముఖ్యకారణమని స్థానిక రైతులు వాపోతున్నారు. మండలంలో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 2,792 ఎకరాల్లో కంది పంటను సాగుచేస్తున్నట్లు ఆ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. అయితే ఇంకను కందుల కొనుగోలు చేయక పోవడంతో దళారులు క్వింటాల్ కు రూ.500 తగ్గించి కొనుగోలు చేసి ఇప్పటికే పలు గోదాముల్లో నిల్వ ఉంచినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే కందులను తమకు అనుకూలంగా ఉన్న రైతుల పట్టాల పేరిట అమ్మేందుకు ముందస్తుగా ప్రణాళిక ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రైతులు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని సేవాదాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, మండల కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా వేద పండితుల చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. జ్ఞాన సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంఘం రాష్ట్ర కార్యదర్శి, బానోత్ గజానంద్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ ఉమాజి, దుర్గే మిలింద్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానోబా పుష్కర్, మాజీ జెడ్పీటీసీ రూపావతి పుష్కర్, సురేష్, మహేందర్, ఉపాధ్యాయ సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ సమ్మద్రాల సరిత రాజన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని, చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమి గెలుపుకు నాంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దహెగాం మాజీ జెడ్పీటీసీ సభ్యులు రామారావు, రాచకొండ కష్ణ, శంకర్ గౌడ్, శ్రీనివాస్, రాజు, ఉస్మాన్ పాల్గొన్నారు.

డీఈవోగా గమినియల్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గమినియల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఊశన్న, జిల్లా కోశాధికారి రమేశ్, కార్యదర్శులు హేమంత్ షిండే, సమ్మయ్య పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

అవగాహనతో కుష్టు వ్యాధిని కొంతవరకైన నివారించవచ్చని మండల విస్తరణ అధికారి రవిదాస్ అన్నారు. సోమవారం మండలంలోని బంబారా గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్నట్టు అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రారంభంలో వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం కుష్టువ్యాధి, దాని లక్షణాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డెన్ రాంచందర్, ఏఎన్ఎం సునంద, ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను, విద్యార్థులకు మధ్యాహ్న అందించే వంటలను, స్టోర్‌రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో కర్రీలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కాలం చెల్లిన సరుకులను ఉపయోగించకూడదని సూచించారు. తొమ్మిదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు గణితంపై పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పాఠాలు పూర్తి చేసి తిరిగి సిలబస్ మరోసారి రివిజన్ చేయాలన్నారు. పద తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నా బాయి, ఉపాధ్యాయునిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తిని ఇప్పించి ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆస్తిని ఇప్పించి తనను ఆదుకోవాలని దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన సందెల పోషన్న జిల్లా అధికారులను కోరుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చినప్పటికీ ప్రజావాణి రద్దు కావడంతో తిరిగి వెళ్ళిపోతున్న క్రమంలో విలేకరులతో మాట్లాడారు. తండ్రి నుండి వారసత్వంగా తనకు వచ్చిన ఇంటిని తన అన్న వదిన మల్లేష్, భారతీలు ఇవ్వడం లేదని, గతంలో దహెగాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో ఇల్లు ఇవ్వడానికి అంగీకరించారన్నారు. గత నెలలో అడగడానికి వెళ్లగా అన్న పెద్ద కొడుకు అజయ్ గొడ్డలితో నరుకుతానని బెదిరించాడని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేయడానికి వచ్చినట్లు వివరించారు. తన సమస్య పరిష్కరించి పేదనైన తనను ఆదుకోవాలని వేడుకున్నారు.

మహిళలు పిల్లల రక్షణకు ప్రాధాన్యత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మహిళలు చిన్నపిల్లల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం, భరోసా సెంటర్ ద్వారా 86 హాట్‌స్పాట్లలో 15 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 2 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవిటీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ పై షీ టీం, భరోసా టీం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు షి-టీమ్‌లు పనిచేస్తున్నాయని, ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670565, డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం తెలిపిన వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.

బాల్య వివాహం పై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని వంకులం గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయికి చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన అబ్బాయితో వివాహ నిశ్చితార్థం జరుగుతుందన్న సమాచారం మేరకు సోమవారం జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ వంకులం గ్రామానికి వెళ్లారు. బాల్య వివాహం వల్ల ఎదురయ్యే ఆరోగ్య, మానసిక సమస్యలు, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం వివాహం జరిపితే ఇరువైపు కుటుంబ సభ్యులు, పెద్దలు, పురోహితులకు, పెళ్లి కుమారునికి 2 ఏండ్ల నాన్ బెయిలబుల్ శిక్ష, రూ. ఒక లక్ష జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు. దీంతో ఇరువైపు పెద్దలు నిశ్చితార్థాన్ని నిలిపివేశారు. అమ్మాయి చదువు కొనసాగించాలని, 18 ఏండ్లు నిండిన తర్వాతే పెండ్లి చేయాలని సూచించారు. ఇందులో కౌన్సిలర్ రవళి, కానిస్టేబుల్ మల్లీశ్వరి, అనీష్ కుమార్, అంగన్వాడి టీచర్ లత పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కష్ణమాచారి డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం విషయం ప్రస్తావనకు రాకపోవడంపై జిల్లా విద్యాధికారి గమినియాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగా ఉందన్నారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నవంబర్ నుండి జనవరి వరకు రాష్ట్ర వాటా వేతనాలు చెల్లించాలన్నారు. కోడిగుడ్ల బిల్లులు ఆగస్టు నుంచి దాదాపు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూరగాయల బిల్లులు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్య వ్యవస్థలో ఎండీఎం కార్మికుల పాత్ర ఎంతో ఉందని అయినప్పటికీ వారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాన్కు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం వివక్ష

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం లౌకిక రాజ్యంలో సరైన విధానం కాదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి కోరిన మేరకు నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాల్సి ఉంటుందని, కానీ రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ కనబరుస్తుందన్నారు. దేశానికి ఆదాయాన్ని సమకూర్చడంలో రాష్ట్ర పాత్ర ఎంతో ఉందని కనీసం ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా శ్యామ్, పార్టీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిల్లా నాయకులు మునీర్, వసంతరావు, ముఖేద్, దీపక్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆర్టీసీ టిమ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని డిపోలో పనిచేస్తున్న టిమ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 11 నుంచి ఆందోళన చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. డ్రైవర్లతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు, అనంతరం డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపో మేనేజర్ వేధింపులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గత కొన్ని ఏండ్లుగా టిమ్ డ్రైవర్స్‌గా పనిచేయుచున్నారని, ఈ మధ్య పని భారం పెరిగి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, టికెట్లు ఇవ్వడం, కార్గో చూసుకోవడం, రిజర్వేషన్ చెక్ చేసుకోవడం, రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల ఫోన్లు చేసి విసిగించడం, బస్సు నడపడం లాంటివి ఒకే సమయంలో చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టిమ్ డ్రైవర్లకు హైదరాబాద్ డ్యూటీకి మూడు మస్టర్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ డిపోలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాత విధానంలో మూడు మస్టర్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారం కోసం కషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిమ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వసంత పంచమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సోమవారం ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో సరస్వతి మాతకి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరైన చిన్నారులకు పలకలు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్యాల ప్రదీప్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పాఠశాల కమిటీ కార్యదర్శి వేణుగోపాల్ సహకార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు.

వివిధ ఆలయాల్లో

జిల్లా కేంద్రంలోని వివిధ ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించగా, జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్దవాగు ఒడ్డున గల బాలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో చిన్నారులకు ఆలయ అర్చకుడు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై మండల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో 2వ ఏఎన్ఎంల పోస్టులను పెంచాలని, రూ. 10 లక్షల గ్రాట్యూటీ, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, పెండింగ్లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు, అప్పటికీ పరిష్కరించకుం 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్ఎం యూనియన్ జిల్లా జాయింట్ కార్యదర్శి ప్రమీల, ఏఎన్ఎంలు వనిత, తులసి, సునీత పాల్గొన్నారు.



రైల్వే పార్కింగ్‌లోని వాహనం అద్దాలు ధ్వంసం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆవరణలోని రైల్వే పార్కింగ్‌లో నిలిపి ఉంచిన వాహనం (కారు) అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. బెజ్జూరు మండలకేంద్రానికి చెందిన రాచకొండ నగేష్ హైద్రాబాద్‌కు వెళ్లేందుకు కాగజ్‌నగర్‌కు తన వాహనంలో వచ్చి ఆ వాహనాన్ని రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న పార్కింగ్‌లో నిలిపాడు. సోమవారం తెల్లవారుజామున వచ్చిన నగేష్ తన వాహనం కోసం పార్కింగ్ స్థలానికి వెళ్లగా అప్పటికే వాహనం వెనుకభాగం అద్దాలు ధ్వంసమై ఉన్నాయి. దీనిపై బాధితుడు 139కి ఫిర్యాదు చేయగా, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందికి సమాచారం వెళ్లింది. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన సిబ్బంది ఈ విషయాన్ని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ దృష్టికి తీసుకువెళ్లారు. రైల్వే పార్కింగ్‌ను అధికారికంగా నిర్వహించడం లేదని, ఈ పార్కింగ్ నిర్వహణ కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో అది నిరుపయోగంగా ఉన్నట్లు కైలాష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనం అద్దాలు ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యమే కారణం

కాగా రైల్వే స్టేషన్ ఆవరణలో నిలిపి ఉంచిన వాహనం అద్దాలు ధ్వంసం కావడానికి రైల్వే అధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. రైల్వే పార్కింగ్‌ను అధికారికంగా కేటాయించకపోయినపుడు ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ బోర్డు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా నిత్యం వేలాది మంది ప్రయాణీకులు ప్రయాణించే ఈ రైల్వే స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై సీసీఐ కైలాష్‌ను వివరణ అడిగితే త్వరలో పార్కింగ్ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకానగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. చిన్నారులకు పలకలు, చాక్‌పీస్‌లను దాతలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన చేపట్టనున్న 'లక్షల డప్పులు-వేల గొంతులు' కార్యక్రమ పోస్టర్లను సోమవారం ఎంఆర్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలంపల్లి శ్రీనివాస్, కొండా బ్రహ్మయ్య, గొడిసెల ఎల్లేష్, నక్క మనోహర్, ప్రవీణ్, కిశోర్, బన్నమూర్తి, గోగర్ల కిరణ్, కళ్యాణ్, సృజన్, అర్జున్, లక్ష్మన్, మధూకర్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం పీఏసీఎస్ కొత్తపేట సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, సిర్పూరు వ్యవసాయాధికారి గిరీష్‌లు దీనిని ప్రారంభించారు. దీనిని కాగజ్‌నగర్ డివిజన్‌లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సీఈఓకు అధికారులు సూచించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా

- నూతన జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం అన్నారు. జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన అనంతరం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన తనను పార్టీ గుర్తించి పెద్ద బాధ్యతను అప్పగించిందని, ఈ బాధ్యతను సమర్ధవంతంగా నెరవేరుస్తానని అన్నారు. ఇందుకు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్‌లతో పాటు జిల్లాలోని అందరు నాయకులు, కార్యకర్తల సహకారం అవసరముంటుందని అన్నారు. అనంతరం నాయకులు ధోని శ్రీశైలంను సన్మానించారు. పట్టణ అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రచారి, శ్రీదేవి, కొండ్ర మనోహర్‌గౌడ్, దెబ్బటి శ్రీనివాస్, పుల్ల అశోక్, చిప్పకుర్తి శ్రీనివాస్, ప్రణయ్, కొప్పుల శంకర్, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ అడ్డాలపై మెరుపు దాడులు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరిహద్దు గ్రామాలైన గోయగాం, చిచ్‌పల్లి గ్రామ శివారులో 100కు పైగా పశువులు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో అక్రమ అడ్డాలపై దాడులు నిర్వహించారు. ఎస్పీ వస్తున్నట్టు సమాచారం అందుకున్న అక్రమార్కులు కట్టి ఉంచిన పశువులను సమీపంలోని పంట పొలాల్లో వదిలేశారు. అయినా సిబ్బందితో కలిసి ఎస్పీ మూడు చోట్ల దాడులు చేసి సుమారు 100 వరకు పశువులను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన పశువులకు స్థానిక పశువైద్య సిబ్బందితో వైద్యం చేయించారు. పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాలను వాహనాల్లో తరలిస్తే అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన తీసుకుంటామని హెచ్చరించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఫిబ్రవరి 04, 2025 | www.navatelangana.com

ఒమన్ దేశంలో జన్నారం వాసి మృతి

వతెలంగాణ-జన్నారం



మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం మల్లేష్(48) ఒమన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మల్లేష్ ఏడాది క్రితం ఒమన్ దేశానికి బతుకుదెరువు కోసం వెళ్లాడు. వచ్చే శనివారం రెండవ కుమార్తె పెళ్లి ఉంది. ఇంతలోనే మల్లేష్ మృతితో కవ్వాల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరణ వార్తతో ఆ కూతురు బోరున విలపిస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒమాన్ దేశం నుంచి మల్లేష్ మృతదేహాన్ని త్వరగా తీసుకురావడానికి గ్రామ మాజీ సర్పంచ్ శేషారావు, నాయకులు షాకీర్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. కావలసిన అన్ని రకాల ధ్రువపత్రాలు తయారుచేసి అధికారులకు అందజేశారు.

పులి కదలికలతో బుగ్గ ఆలయ దారి మూసివేత

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలం బుగ్గ ఆలయ పరిసరాల్లో పులి తిరుగుతున్నందున అటవీ అధికారులు ఆలయానికి వెళ్లే దారి మూసివేశారు. సోమవారం జరిగే అన్నదానం తాత్కాలికంగ రద్దు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి తెలిపారు. తిర్యాని అడవుల మీదుగా కన్నాల అటవీ ప్రాంతానికి వచ్చిన బీ-2 పెద్దపులి ఈ ప్రాంతంలోనే మకాం వేసినట్టు అటవి అధికారులు గుర్తించారు. గురువారం సాయంత్రం నుంచి కన్నాల పరిసరాల్లో సంచరిస్తూ అటవీ సిబ్బందికి కనిపించిందని, శనివారం కన్నాల శివారులోని పత్తి పంట చేనులో అడవి పందిపై దాడి చేసి చంపినట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారు. పులి కదలికలపై డ్రోన్ల సహాయంతో పసి కడుతున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. అడవిలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పులి సంచారాన్ని సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆదివారం ఉదయం పెద్దపులి శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అతి సమీపంలో సంచరించినట్లు అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు.

లక్ష డప్పులు, వేల గొంతుల పోస్టర్ విడిదల

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఏబీసీడీ వర్గీకరణ సాధనకై ఫిబ్రవరి 7న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో భారీ మాదిగ సాంస్కృతిక ప్రదర్శనకు వేల గొంతులు, లక్ష డబ్బుల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాల, మాదిగ జాతి బిడ్డలు, సంకన డప్పు చేతుల సద్ది పట్టుకొని రేపటి మహా ప్రదర్శనకు హైదరాబాద్ తరలిరావాలని మండల, పట్టణ కమిటీ ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మంద మధు, పట్టణ అధ్యక్షులు కల్లేపల్లి విక్రం, ప్రధాన కార్యదర్శి అడ్లూరు శివ, మండల గౌరవ అధ్యక్షులు తోటపల్లి మహేందర్, జిల్ల, రాష్ట నాయకులు అవునూరి లచ్చన్న, ముల్కాల రంజిత్, చిప్పకుర్తి నారాయణ, ముల్కాల రాందాస్, శనిగారపు లింగన్న, లింగంపల్లి వెంకటేష్, తగరపు సత్యం, కుశనపల్లి రాములు, మంద భీమయ్య, మండల ఉపాధ్యక్షులు కలమడుగు సిసింద్రీ, శాతరాజు రాజేష్, దర్శనాల నవీన్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని బుగ్గగూడెం గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి వెంకటేశం, డీఈఈ ప్రవీణ్ కుమార్‌లు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వనరులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ మండల ఏఈఈ కె. సాయి అచ్యుత్, పంచాయతీ కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-జన్నారం

వసంత పంచమి సందర్భంగా సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కపెల్లిగూడా, ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాస చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, గ్రామ పెద్దలు భూతం శ్రీనివాస్ చిన్నారులకు పలకలను అందజేశారు. అదేవిదంగా మండల కేంద్రంలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకొని ఆ దేవాలయంలో ఉన్న అమ్మవారిని సరస్వతీ మాత రూపంలో వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. రోటి గూడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించిన ఏఈఓలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రారంభించారని మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఐదు క్లస్టర్ లకు గాను ప్రతి క్లస్టర్‌లో 2000 ఎకరాలు డిజిటల్ క్రాప్ సర్వే చేయాల్సి ఉందని మిగతా ఏరియా రెగ్యులర్ క్రాప్ బుకింగ్ పద్ధతిలో చేయాల్సిందిగా శనివారం ప్రభుత్వం నుండి ఆదేశాలు రావడంతో సోమవారం ఎంపికైన గ్రామాలలో డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రారంభించారు. డిజిటల్ క్రాప్ సర్వే విధానంలో ఏఈఓ ప్రత్యక్షంగా ప్రతి సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ దగ్గరికి వెళ్లి అక్కడ పంట వివరాలను నమోదు చేయడంతో పాటు, ప్రతి సబ్ డివిజన్‌లోఉన్న పంట యొక్క ఫోటోను పోర్టల్ అప్లోడ్ చేయవలసి ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా దాదాపు పంట వివరాల నమోదు 100 శాతం ఖచ్చితత్వాన్ని కలిగి ఉంటుంది.

జగదాంబ దేవి ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బంగారు తండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ జగదాంబ దేవి ఆలయాల నిర్మాణాలకు సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు లక్ష్మీ మాత, అమర్ సింగ్ ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాల నిర్మాణానికి దాతలు ఔత్సాయకులు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించి త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు సంతోష్, బీజేపీ నియోజకవర్గ నాయకులు రితేష్ రాథోడ్, కాంగ్రెస్ నాయకులు శ్యామ్ నాయక్, జన్నారం ఏఎంసీ డైరెక్టర్ లకావత్ తిరుపతి పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో గర్ల్స్ చైల్డ్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

వ్యక్తులందరూ ముఖ్యంగా కిషోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ మౌనిక విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల లక్షెట్టిపేటలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన, గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరై, ఆరోగ్య విషయమై, పౌష్టికాహారంపై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె రామ కల్యాణి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె మహేశ్వర రావు, చైల్డ్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు హెచ్ శ్రీలత, ఆర్ ప్రవీణ పాల్గొన్నారు.

దేవునిగూడెంలో ట్రైనింగ్ అధికారుల పర్యటన

తెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడెంలో మిలిటరీ ఇంజనీరింగ్ ట్రైనింగ్ శిక్షణ అధికారులు పర్యటించారు. హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ సెంటర్‌కు చెందిన శిక్షణ అధికారులు సోమవారం దేవునిగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతు వేదిక, గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణ అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

నవతెలంగాణ-మంచిర్యాల



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ రైతాంగానికి, విద్యార్థులకు పేద ప్రజల అభ్యున్నతికి ఎటువంటి ఉపయోగ కరంగా బడ్జెట్ లేదని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో కేంద్రం మొండి చెయ్యి చూపించిందని అన్నారు. నిధులన్నీ బీహార్ రాష్ట్రానికి కేటాయించారనిఎద్దేవా చేశారు. తెలంగాణకు అన్యాయం చేస్తున్న మోడీపై తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో ధ్వజం ఎత్తాలని కోరారు. మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.

మందమర్రి : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్లూరు లక్ష్మణ్, పైడిమల్ల నర్సింగ్, మంద తిరుమలరెడ్డి, నెరువట్ల శీను, ఎర్ర రాజు, ఆంజనేయులు, నర్సోజి, యువజన నాయకులు రాయబారపు కిరణ్, బియ్యపు రవికిరణ్ , వడ్లకొండ సునీల్, శేఖర్ పాల్గొన్నారు.

జన్నారం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించకుండా వివక్షతో వ్యవహరించిందని కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయానికి నిరసనగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాలతో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో, చేసి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 8 మంది ఎంపీలు ఉన్న, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా బడ్జెట్లో రాష్ట్రానికి గుండు సున్నా, కేటాయించారన్నారు. ఇది తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్ష అన్నారు. దేశంలోని రాష్ట్రాలు అన్నిటికీ కేంద్ర ప్రభుత్వం తల్లిగా వ్యవహరించే, ఆనవాయితికి కేంద్రంలో ఉన్న ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సవతి తల్లిలా ప్రవర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గుర్రం మోహన్‌రెడ్డి, ఇసాక్, మత్స్య శంకరయ్య, మామిడిపల్లి, ఇందయా దూమల్ల రమేష్, పాత బాలరాజు, ముత్యం సతీష్, పద్మారావు శేషారావు, సక్రు నాయక్, షాకీర్ అజార్, సత్తన్న రేగుంట ప్రదీప్ బండారి స్వామి అజారుద్దీన్ లకావత్ తిరుపతి, లక్ష్మి ప్రశాంత్ ఈర్నాల గంగన్న జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన చర్యలు చేపట్టాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్‌లతో కలిసి జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ నులిపురుగుల నిర్మూలన కొరకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాల పిల్లలకు మాత్రలు వేయడం జరుగుతుందని, పిల్లలకు మాత్రలు తినిపించడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపం నుండి పిల్లలను కాపాడుకునేందుకు సకాలంలో ఆల్బెండజోల్ మాత్రలు అందించడం జరుగుతుందని, ఈ మాత్రలను బాగా నమిలి శుభ్రమైన తాగునీటితో తీసుకోవాలని తెలిపారు. వికారం, స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాల పరిస్థితి నుంచి పిల్లలను కాపాడుకునేందుకు ఈ మాత్రలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అనిత, ప్రసాద్, సుధాకర్ నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

నవతెలంగాణ-నస్పూర్



ప్రతి మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధార్ కార్డు చాలా ముఖ్యమని, అందరికి ఆధార్ కార్డు ఉండాలని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మాత్రం అందుబాటులో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని, దీనితో ప్రజలు కార్మికులు విద్యార్థులు యువత అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో ఉన్న ఆధార్ కేంద్రాలు అన్ని మండలాల్లో లేకపోవడం, ప్రస్తుతం ఉన్న ఆధార్ కేంద్రాల్లో సిగ్నల్స్ సరిగ్గా రాకపోవడం వలన జిల్లాలోని విద్యార్థులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆఫీస్ నందు ఉన్న ఆధార్ కేంద్రంలో ప్రజలు ఒక రోజు ముందు వచ్చి అక్కడే ఉండటం లేదా తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ఆధార్ టోకెన్ కోసం వేచి చూడాల్సి వస్తుందని వాపోయారు. రోజుకు 40 టోకెన్స్ ఇచ్చే సరికి టోకెన్స్ రాని వారు చాలా మంది నిరాశతో వెనుతీరుగాల్సి వస్తుందన్నారు.

మూడు తగ్గాయి.. రెండు పెరిగాయి..

- జిల్లాలో మొత్తంగా 129 ఎంపీటీసీ స్థానాలు
- తాజా ముసాయిదా ప్రకటించిన జడ్పీ సీఈఓ

హాజీపూర్ : జిల్లాలో ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ప్రకటించిన తాజా ముసాయిదా ప్రకారం మూడు తగ్గగా రెండు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తమవుతున్న తరుణంలో ప్రతీ మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలనే పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 144 నిబంధనలో ఉంది. ఈ మేరకు జిల్లాలో ఎంపీటీసీ స్థానాల పునర్విభజనకు ప్రభుత్వం నిబంధనల మేరకు తుది జాబితా ఖరారు చేసి సోమవారం జడ్పీ సీఈఓ గణపతి జిల్లా ఎంపీటీసీ స్థానాలను అధికారికంగా ప్రకటించారు. ఈ తుది నోటిఫికేషన్ జాబితాలను జిల్లాలోని 16 మండల ప్రజాపరిషత్ కార్యాలయాలతో పాటు జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శనగా ఉంచారు.

నాలుగు మండలాల్లో పెరిగిన స్థానాలు

జిల్లాలోని భీమిని, భీమారం మండలాల్లో నాలుగు స్థానాలు ఉండగా నిబంధన మేరకు ఈ మండలాల్లో ఒక్కో ఎంపీటీసీ స్థానం పెరిగింది. అలాగే హాజీపూర్ మండలంలోని ఐదు పంచాయతీలు మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనమయ్యాయి. దీంతో హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట గ్రామాల 3 ఎంపీటీసీ స్థానాలు కనుమరుగయ్యాయి. మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు జిల్లాలో 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 3 ఎంపీటీసీ స్థానాలు తగ్గిపోగా భీమిని, భీమారంలో ఒక్కో ఎంపీటీసీ స్థానంతో రెండు పెరిగాయి. ఇటు ఎంపీటీసీ స్థానాలు ఖరారు కావడం ఆటు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ఆరంభం కాగా ఎన్నికల సామాగ్రి సైతం జడ్పీ కార్యాలయానికి చేరుకుంది.

రెడ్ క్రాస్ సొసైటీ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-మంచిర్యాల



అత్యవసర వైద్య సేవలు, సికిల్ సెల్, తల సేమియా వ్యాధిగ్రస్తులకు, రక్త నిధి కేంద్రం ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాలో అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీ నగర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీలో తల సేమియా-సికిల్ సెల్ నూతన భవన నిర్మాణానికి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బొప్పు సతీష్‌లతో కలిసి భూమి పూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాలో ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులకు, గర్భిణులకు అత్యవసర సేవలు అందించడం, తల సేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడంలో విశేష సేవలు అందించడం జరుగుతుందని, నూతన భవన నిర్మాణం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసి వ్యాధిగ్రస్తులకు సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, ఎంసీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, ఉదారి చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-జైపూర్

న్యాయ సమ్మతమైన ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, మాదిగ సామాజిక వర్గం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రలో చలో హైదరాబాద్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు-వేల గొంతుల భారీ సాంస్కృతిక మహా ప్రదర్శన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మాదిగ మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గం నాయకులు ఏ పార్టీల్లో ఉన్నా పార్టీలకు అతీతంగా వర్గీకరణ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. అదేవిధంగా హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ సాంస్కృతిక ప్రదర్శనకు జైపూర్ మండల నుండి భారీగా తలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు ఇరుగురాల మల్లేష్, మాజీ జిల్లా అధ్యక్షులు చిప్పకుర్తి వెంకన్న, మాజీ జెడ్పీటీసీ మేడి తిరుపతి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆసంపల్లి శ్రీకాంత్, రేగుంట రాకేష్, కలగూర రాజకుమార్, ఆసంపల్లి రాయమల్లు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఫిబ్రవరి 5వ తేదీ నుండి నిర్వహించాలన్న సదరం శిబిరాలను అర్హత గల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ సేవ నందు స్లాట్ బుక్ చేసుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్దేశిత తేదీలలో నూతన సదరం ధ్రువపత్రం, కాలపరిమితి ముగిసిన ధ్రువపత్రం రెన్యువల్‌కు సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 5వ తేదీన మూగ, చెవుడు (50), 11, 19 తేదీలలో శారీరక వికలాంగులు-ఆర్థో (60), 25న మానసిక వికలాంగులు (50), 28న కంటి చూపు(25) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్‌కు గతంలో స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్నవారు జాబితాలో ముందు ఉన్న వారి మొబైల్ నెంబర్‌కు సదరం శిబిరానికి రావలసిన తేదీ మెసేజ్ అందుతుందని, మెసేజ్ వచ్చిన వారు మాత్రమే ఆయా తేదీల్లో శిబిరానికి సంబంధిత పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. సదరం శిబిరం కాలపరిమితి పూర్తి అయిన వారు రెన్యువల్‌కు ఫిబ్రవరి 4వ తేదీ నుంచి మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు.

పాఠశాలల్లో ఘనంగా వసంత పంచమి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ జక్కెన రమేష్, ఎయిమ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ మైదం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ పూజ చేసి పిల్లలకు ఉచితంగా అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాఘ మాసంలో శుద్ధ పంచమి రోజున సరస్వతి దేవుని పూజిస్తారని, ఈ పవిత్రమైన రోజే సరస్వతి దేవి జన్మించినట్టు పురాణాల ద్వారా తెలుస్తుందని తెలిపారు. అంతేకాకుండా పిల్లలకు ఈ రోజున అక్షరాభ్యాసం చేయించడం వల్ల ఉన్నత స్థాయికి వారు చేరుకుంటారని నమ్ముతారని తెలిపారు. అందుకే ఈ అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మందమర్రి : వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులను పాఠశాల ఆవరణలోని సరస్వతి అమ్మవారి దగ్గరికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఆచార్యులు కట్ట శిరీష, కార్యదర్శి దాసరి రాములు సొసైటీ అధ్యక్షుడు బండారి సూరిబాబు, ఆచార్య శ్రీజ, మాస్టరు రమేష్ రాజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఎక్స్ రోడ్ వద్ద, సోమవారం రోడ్డు ప్రమాదం జరిగి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మానుక మల్లేష్, ప్రధాన రహదారి నుంచి ద్విచక్ర వాహనం (లూనా)పై తన ఇంటికి వచ్చే మార్గమధ్యలో రాంపూర్ ఎక్స్ రోడ్ వద్ద వెనుకనుంచి స్పీడ్‌గా వస్తున్న హెరిటీగా వాహనం ఢీకొట్టడంతో, మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య సుజాత ఫిర్యాదు మేకరు దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

రికవరీ డబ్బును వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

హెచ్‌బీఎల్ఆర్ఎస్ సంబంధించిన వడ్డీ ఎక్కువగా చెల్లించామని యాజమాన్యం కార్మికుల వద్ద నుంచి రికవరీ చేసిన డబ్బులను వెంటనే చెల్లించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం 8.3శాతం వడ్డీని చెల్లించిందని కరోనా సమయంలో వడ్డీ రేట్లు కార్మికులు తక్కువగా చెల్లించారని యాజమాన్యం కార్మికుల వద్ద నుంచి రికవరీ చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డి కట్టలు దగ్ధం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో 100 గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. ఆ గ్రామానికి చెందిన వాసాల రమేష్‌కు చెందిన గడ్డి కట్టలలో సోమవారం మంటలు చెలరేగాయి. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పి వేశారు. సకాలంలో మంటలను ఆర్పి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఫైర్ అధికారి శ్రీనివాస్ వివరించారు. దాదాపు 5వేల వరకు నష్టం జరిగిందని రైతు వాసాల రమేష్ తెలిపారు.

ఉద్యోగులకు స్పెషల్ ఇన్సెంటివ్ స్కీంను ప్రకటించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో ఉత్పత్తిలో భాగంగా ఉద్యోగులకు స్పెషల్ ఇన్సెంటివ్ స్కీంను డిసెంబర్ నెల నుండి ప్రకటించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటన పేర్కొన్నారు. 2024-25 స్పెషల్ ఇన్సెంటివ్ స్కీమును కేవలం ఫిబ్రవరి, మార్చి నెలలో ఇవ్వటం చాలా బాధాకరమని పేర్కొన్నారు. నవంబర్ నెలలో డైరెక్టర్(పా)తో జరిగిన నిర్మాత్మక సమావేశంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు డిసెంబర్ నెల నుండి అమలులోకి వస్తాయని, అగ్రిమెంట్ చేసుకున్నామని చాలా గొప్పగా చెప్పిన ఈ సంఘాలు సింగరేణి ఉద్యోగులకు తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. వెంటనే యాజమాన్యం డిసెంబర్ నెల నుండి ఈ స్పెషల్ ఇన్సెంటివ్ స్కీమ్‌ను అమలుపరచాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

నవతెలంగాణ-భైంసా

ఉష ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దేగాం గ్రామంలో శిక్షకురాలు స్రవంతి మహిళలకు 40 రోజుల పాటు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చారు. కాగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సోమవారం భైంసాలోని తన నివాసంలో సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు. ఇందులో నాయకులు సొలంకి భీమ్‌రావ్, బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు చక్రధర్ పటేల్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌ని సన్మానించిన బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ-మందమర్రి

మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుని జాతీయ బీసీ సంఘం నాయకులు సోమవారం మర్యాపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మందమర్రి మున్సిపాలిటీకి నూతనంగా కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన రాజలింగుని పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మోడీ కక్షపూరిత రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతాం



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ప్రధాన మంత్రి మోడీ కక్షకట్టినట్టుగా బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరు అర్థమవుతుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో స్థానిక నాయకులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాల ఎదుట బైటాయించి నిరసన చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును వ్యతిరేకించారు. మోడీ కక్షపూరిత రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు, నిరుద్యోగులకు ఎంత మాత్రం ఉపయోగకరంగా లేదని, అన్ని రాష్ట్రాలను సమంగా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణకు నయాపైసా కేటాయించకుండా బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సమన్యాయం చేయలేని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధిని వ్యతిరేంచినట్లు అవుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన చిన్న రాష్ట్రం అభివృద్ధికి సహకరించాల్సిన అవసరాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి సేకరిస్తున్న ఫండ్‌కు అదనపు ఫండ్ కేటాయించాల్సిన కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన రాష్ట్రాలకు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంతెన లక్ష్మన్, అంబల్ల రవి, శీలం వెంకటేశం, విశ్వంబర్ రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో హల్‌చల్

- వేటగాళ్లనే అనుమానంతో రైలులో ప్రయాణిస్తున్న వారిని దింపి అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు



నవతెలంగాణ-కాగజ్ నగర్

జైపూర్ నుండి చెన్నై వెళ్తున్న సూపర్ ఫాస్ట్ రైలులో వేటగాళ్ల ప్రయాణిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అటవీ అధికారులు సోమవారం సాయంత్రం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలో వన్యప్రాణులను హతమార్చిన ముఠా నాగపూర్ నుండి వస్తున్నట్లు కాగజ్‌నగర్ ఎఫ్‌డి ఓ సుశాంత్ సుకుదేవ్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశం మేరకు డివిజన్‌లోని అటవీ సిబ్బంది పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్ చేరుకున్నారు. వీరికి కాగజ్‌నగర్ టౌన్ సిఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ సుధాకర్, ఆర్‌పిఎఫ్‌సిఐ శ్రీనివాస్‌గౌడ్ కూడా సహకరించి తనిఖీల్లో పాల్గొన్నారు. రాత్రి 7-10 నిమిషాలకు రైలు రైల్వేస్టేషన్‌కు చేరుకోగా ఆ రైలులో జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న అనుమానితులను దింపి తనిఖీలు చేపట్టారు. వారి సామాగ్రిని పరిశీలించగా అందులో వేటకు ఉపయోగించే పరికరాలు లభ్యమయ్యాయి. అవి అడవి జంతువులను హతమార్చడానికే ఉపయోగిస్తారని అటవీ అధికారులు తెలుపుతుండగా, చిన్న చిన్న ప్రాణులను హతమార్చి పొట్ట నింపుకుంటామే తప్ప అడవి జంతువులను తాము చంపమని వారు తెలిపారు. అయినా అటవీ అధికారులు వినకుండా సుమారు 10 కుటుంబాలకు చెందిన సుమారు 30 మందిని అటవీ అధికారులు అదుపులోకి తీసుకొని అటవీ డివిజన్ కార్యాలయానికి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్



టేకుమట్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ (38) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్ భార్యను పుట్టింటిలో వదలి తన ఇంటిలో చీరతో ఉరివేసుకున్నాడు. అనారోగ్య సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య కొత్తపల్లి తేజ పిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బోథ్‌లో సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో నాగభూషణంతో పాటు సొనాలలోని వివేకానంద పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి చిన్నారులు వారి తల్లిదండ్రులతో హాజరై అక్షరాభ్యాసం చేయించుకున్నారు. అక్షరాభ్యాసం చేయించుకున్న చిన్నారులకు వివేకానంద పాఠశాలలో పలక, బలపం సరస్వతి దేవి ఫోటో ఉచితంగా అందించారు. అక్షరాభ్యాసం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వసంత పంచమి విశిష్టతను తెలియజేశారు. అక్షరాభ్యాసం అనంతరం హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది కోస్మెట్ శుద్ధోధన్, శ్రీధర్, హరీష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు తేదీని ఈనెల 6 వరకు పొడగించినట్టు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్, మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి అప్లై చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కు తీవ్ర అన్యాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటులో కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన ఆర్థిక బడ్జెట్ అటు తెలంగాణ రాష్ట్రానికి, ఇటు ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయాన్ని మిగిల్చిందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ కేంద్ర ప్రభుత్వ చూపిస్తున్న పక్షపాతాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు, జెండాలతో నిరసన ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మోడీ, బీజేపీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కక్ష్యపూరిత వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులన్ని ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు, ఎన్‌డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకు దక్కాయని అన్నారు. కేవలం కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేసిందని, బీహార్, ఢిల్లీ, ఏపీ, గుజరాత్‌లకు మాత్రమే ప్రాధాన్యతనివ్వడం కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు బీజేపీకి 4 గురు ఎమ్మెల్యేలు ఒక ఎంపీని ఇచ్చినా కూడా ఇక్కడి ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, నవీన్ రెడ్డి, నరసింహ చారి, అనుముల ఉషన్న, జుబేదా, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరమేశ్వర్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, అబిబ్, వసీం ఉన్నారు.

తాంసి : పార్లమెంట్ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఉన్నప్పటికి పార్లమెంట్ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి చిల్లిగవ్వ కూడా బడ్జెడ్‌లో నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా న్యాయంగా రావాల్సిన నిధులు రాకపోవడం బాధాకరమన్నారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ మీదుగా రైల్వే లైన్ కొరకు నిధులు, ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు జాతీయ హక్కు, అటవీ పర్వత ప్రాంతాలకు ప్రధానమంత్రి యోజన పథకాలకు నిధులు విడుదల చేయలేకపోవడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కౌడాల సంతోష్, నరేష్, రామన్న యాదవ్, ధనుంజయ్, హనండ్లు, నాందేవ్, కిషన్, వెంకట్‌రెడ్డి, రాజబలి, మండల నాయకులు పాల్గొన్నారు.

బాసర పుణ్యక్షేత్రంలో పులకించిన భక్తజనం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్
- వేడుకగా అక్షరాభ్యాస పూజలు



నవతెలంగాణ-ముధోల్

బాసర పుణ్యక్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు ఉత్సవాలు సందర్భంగా సోమవారం సరస్వతి అమ్మవారికి నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. చదువుల తల్లి అనుగ్రహం కోసం పిల్లలతో అక్షరభ్యాస పూజలు చేయించారు. బాసర పుణ్యక్షేత్రం వసంత పంచమి శోభతో, భక్తజనం పులకించింది. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్...

వసంత పంచమి ఉత్సవాల్లో భాగంగా చదువుల తల్లీ సరస్వతికి నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఆలయం వద్ద ఆమెకు ఆర్డీఓ కోమల్ రెడ్డి, ఆలయ చైర్మెన్ శరత్ పాటక్, ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో మంగళవాయిద్యాలతో కలెక్టర్‌ను ఆలయం లోపలకు తీసుకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున తీసుకు వచ్చిన పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా అక్షర శ్రీకారం...

అమ్మవారి జన్మదినం సందర్భంగా అక్షర శ్రీకార పూజలు వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జాము నుండే క్యూ లైన్‌లో భక్తులు, చిన్నారులు బారులు తీరారు. తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ సన్నిధిలో ప్రత్యేక అక్షరాభ్యాస పూజలను అర్చకులు ప్రారంభించారు. అక్షరాభ్యాస పూజలకు రెండు గంటల సమయం పట్టింది.

మేధా దక్షిణమూర్తి హోమం..

అమ్మవారి సన్నిధిలో ఉదయం ఏడు గంటలకు అర్చకులు, వేద పండితులు చండి హోమం, మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వసంత పంచమి సందర్భంగా వివిధ ప్రాంతల నుంచి భారీగా వాహనాల్లో తరలివచ్చిన భక్తుల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బందోబస్తును నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేకంగా దగ్గరుండి పర్యవేక్షించారు.

అమ్మవారికి ఒక్కరోజే రూ.58లక్షలు ఆదాయం...

వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతి దేవి అమ్మవారి ఒక్కరోజే రూ.58లక్షలు సమకూరింది. వెయి రూపాయల ప్రత్యేక అక్షరాభ్యాసాలు రూ.33లక్షల 20వేల 150 రాగా అక్షరాభ్యాసాలు 6303, మొత్తం 9623 ఒక్కరోజే జరుగడం విశేషం.

మహిళలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇందిరా మహిళా శక్తి ప్రధానమంత్రి మత్స్య సందప యోజన కింద రూ. 10లక్షల విలువైన సంచార చేపల విక్రయ వాహనం మంజూరైంది. కాగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా వాహనాన్ని ప్రారంభించి, లబ్ధిదారుకు జైనథ్ మండలం పెండల్‌వాడకు చెందిన సరస్వతి మహిళా సమాఖ్య సభ్యురాలు టాడ్రీ సునీతకు అందించారు. ఈ వాహనం ద్వారా పరిసర నీటి వనరుల్లో లభించే వివిధ రకాల చేపలు, వాటితో తయారయ్యే భిన్న రుచుల వంటకాలను విక్రయిస్తారని పేర్కొన్నారు. జాతరలు, పార్కులు, ప్రధాన కూడళ్లు, మార్కెటింగ్ ఏరియాల్లో సంచార వాహనాన్ని నిలిపి 'విక్రయాలు సాగించడం జరుగుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన నమ్మకమైన చేపలను అందించడంతో పాటు వ్యాపారానికి ముందుకు వచ్చే స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాల్లో చేపలు ముందు వరుసలో ఉంటాయన్నారు. వీటి ద్వారా పోషకాలతో పాటు ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే ఓమెగా త్రీ ఫ్యాటి, యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయన్నారు. లబ్ధిదారు చేపల విక్రయాలు, వంటకాల తయారీలో శిక్షణ సైతం పొందినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటు లాభదాయక వ్యాపారాలు సాగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, జిల్లా మత్స్యాశాఖాధికారి భాస్కర్, జైనాథ్ ఇన్‌చార్జీ తహసీల్దార్ రాజేశ్వరి, డీపీఎం సుగంద, ఏపీఎంలు స్వామి, భగవాండ్లు, సీసీ లక్ష్మి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ, మేమేం పాపం చేసాం

- ముక్రా(కే) గ్రామ రైతులు చేనులో సెల్ఫీతో నిరసన

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని ముక్రా(కే) గ్రామానికి చెందిన రైతులు మాకు రైతు భరోసా ముఖ్యమంత్రి వేస్తలేరు అంటూ రాహుల్ గాంధీకి సెల్ఫీ ద్వారా నిరసన వీడియోలు పంపించారు. ఈ సందర్భంగా గ్రామ రైతు గాడ్గే సుభాష్ మాట్లాడుతూ ప్రతి రైతుకు రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12 వేలు, మహా లక్ష్మి పథకంలో ప్రతి మహిళకు నెలకు రూ.2500 వేస్తానని చెప్పి ఇప్పుడు మండలానికి ఒక గ్రామానికే ఇస్తున్నారని అన్నారు. మేమేం పాపం చేశామంటూ, హామీలను నేరవెర్చాలని వ్యవసాయ క్షేత్రంలో దుఃఖంతో రైతులు నిలబడి సోషల్ మీడియా ద్వారా రాహుల్ గాంధీకి వీడియోలు పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, విఠల్, ప్రహ్లాద్, దత్త, నాగనాథ్, తిరుపతి, తులసిరామ్, రైతులు పాల్గొన్నారు.



మాలీ మహా సమ్మేళనం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన మాలీ మహా సమ్మేళనం ఈనెల 9న జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో నిర్వహించనున్నట్టు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే తెలిపారు. సమ్మేళనంకు సంబంధించిన పోస్టర్‌లను సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావు పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర, జిల్లా, యువజన, మహిళా విభాగం ఎన్నికల నిర్వహించడం జరుగుతుందన్నారు. మాలీ కులస్తులు యువకులు, మహిళలు పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కోశాధికారి సతీష్ గుర్నులే, జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడగురే, పట్టణ అధ్యక్షుడు శీను ఆచారి, కార్యవర్గ సభ్యులు చౌదరి తులసిరామ్, మోహూర్లే శ్రీను, షిండే గురుదేవ్, ఆత్మరామ్ బెండరే, దీపక్ పాల్గొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

దేశంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రంలో ఈనెల 5 న నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తెలిపారు . సోమవారం జిల్లా కేద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 2025 బడ్జెట్లో కార్మికులకు, దేశ రైతాంగానికి నిరాశ మిగిల్చిందన్నారు. కార్మిక చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు అందించాలని, అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేసే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు కలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌల్, రాయమల్లు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో కుందారం జట్టుకు ప్రథమ బహుమతి



నవతెలంగాణ-జైపూర్

మండలం పెగడపల్లిలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో కుందారం జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఆదివారం రాత్రి వరకు జరిగిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి అందజేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 10 జట్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. హోరా హోరీగా సాగిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కుందారం జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి పొందిన ఇందారం జట్టుకు రూ. 5 వేల నగదు బహుమతి అందజేశారు. ఇక్కడ జరిగిన క్రికెట్ పోటీలను తిలకించిన స్థానిక ఎస్సై శ్రీధర్ క్రీడాకారులను ఉద్దేషించి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా మంచి మార్గంలో యువత కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కబడ్డీ పోటీల నిర్వాహకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, శెట్‌పల్లికి చెందిన రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించి, రహదారికి సహకరించాలి

నవతెలంగాణ-నస్పూర్



రహదారి వేయకుండా అడ్డుగా అక్రమ నిర్మాణం చేపట్టారని, అధికారులు వారిపై చర్యలు తీసుకొని రహదారికి సహకరించాలని చౌటపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఈ విషయమై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ మండలానికి చెందిన కొత్త గుడిసెల్లో దాదాపు 50 ఏండ్లుగా జీవిస్తున్నామని, చాపిడి పోశం వద్ద ఒకరికి ముప్పావు గుంట, ఒక గుంట కొనుక్కొని ఇళ్ళను నిర్మించుకున్నట్లు తెలిపారు. ఇటీవల ఆ కాలనీకి రహదారి వేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని కానీ, రెడ్డి రాజారాం, పసుపుల చాయమ్మ, చీమల రాంబాయి రోడ్డుపైన గోడలు నిర్మించి రోడ్డు నిర్మాణానికి అడ్డుపడుతున్నారని తెలిపారు. అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా స్పందించి అట్టి వారిపై చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణానికి సహకరించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో చాపిడి రాజబాయి, పసుపుల మల్లేశ్వరి, బందెల సత్తమ్మ, డాకూరి చంద్రమ్మ, చాపిడి తిరుపతి పాల్గొన్నారు.